# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-10-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమరావతిని దేశంలోనే మొదటి అయిదు రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు.**

**2. విజయవాడ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్-2026 జరుగుతోంది.**

**3. తిరుపతి జిల్లా శ్రీసిటీలో అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.**

**4. జపాన్ లో జరుగుతున్న ఆసియా క్రీడ పోటీల్లో క్రికెట్ విభాగంలో భారత్ పురుషుల జట్టు ఫైనల్ మ్యాచ్ లో పాకిస్తాన్ తో తలపడుతోంది.**

==========================

ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత మహిళల హాకీ జట్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ భారత జట్టు స్వర్ణం సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. ఈ విజయంతో లాస్ఏంజెల్స్ 2028 ఒలింపిక్స్‌కు భారత్ అర్హత సాధించడం మరింత ఆనందంగా ఉందన్నారు. మ్యాచ్‌లో విజయం సాధించే గోల్ చేసి కీలక పాత్ర పోషించిన లాల్‌రెమ్సియామిని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. కెప్టెన్ సలీమా టెటే, దీపికతో పాటు జట్టులోని ప్రతి క్రీడాకారిణికి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. భారత మహిళల హాకీ జట్టు ఛాంపియన్‌గా నిలవడం యావత్ దేశాన్ని గర్వపడేలా చేసిందని చెప్పారు.

------------------------

అమరావతిని దేశంలోనే మొదటి అయిదు రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో క్రెడాయ్ హోమ్ ఎక్స్‌పో కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2028 అక్టోబర్ నాటికి అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో స్థిరాస్తి రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బిల్డర్లు, డెవలపర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. నిర్మాణ రంగం అభివృద్ధి ద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

------------------------

విజయవాడ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్-2026ను ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 800 మందికి పైగా ప్రతినిధులు, 50 మందికి పైగా కార్పొరేట్ సీఈవోలు హాజరయ్యారు. అదేవిధంగా 100 మందికిపైగా యూనికార్న్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్లు, ఐటీ నిపుణులు, విధాన నిర్ణేతలతో కీలక చర్చలు జరుగుతున్నాయి. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పాన్ ఐఐటీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ..

వాయిస్.... 30

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పౌరులు, ప్రముఖుల నుంచి అందే జ్ఞాపికలు, కానుకల విక్రయానికి సంబంధించి 'పీఎం మెమెంటోస్' ఎనిమిదో విడత ఆన్‌లైన్ వేలం గడువును కేంద్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆసక్తి గల కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ ఆన్‌లైన్ వేల ప్రక్రియలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న దాదాపు 30 రకాల కానుకలు, జ్ఞాపికలు కొనుగోలుదారుల కోసం అందుబాటులో ఉంచారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధ్యానత ఇస్తున్నట్లు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ తెలిపారు. నగరంలోని పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంపీ-ల్యాడ్స్ నిధుల నుంచి 35 లక్షల రూపాయలతో పునరుద్ధరించిన భవనాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ మాట్లాడుతూ..

వాయిస్....29

---------------------------

ప్రజలకు సేవ చేయడం ద్వారా దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం 'ప్రజా సేవాతో దేశ సేవా' పేరుతో ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 'నక్సలిజం అంతం' గురించి ఈ రోజు తెలుసుకుందాం.

1967లో నక్సల్బరీలో ప్రారంభమైన మావోయిస్టు ఉద్యమం దాదాపు ఐదు దశాబ్దాల పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో కొనసాగింది. 2010 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో మావోయిస్టులు జరిపిన దాడిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మరణించారు. 2014 నాటికి 126 జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వ జాబితాలో ఉన్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భద్రతా చర్యలతో పాటు రహదారులు, పాఠశాలలు, మొబైల్ టవర్లు, బ్యాంకింగ్ సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. ఫలితంగా మావోయిస్టుల లొంగుబాట్లు సంవత్సరానికి 421 నుంచి 6 వేల 558కు పెరిగాయని కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఒక్క జిల్లా కూడా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా మిగలలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడిస్తూ..

వాయిస్......30

---------------------------

తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఈరోజు అగ్ని ప్రమాదం జరిగింది. మాత్రలు తయారు చేసే టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో బాయిలర్ పేలి మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. గాయపడిన వారిని చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను  ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు దేశం పార్టీ విద్యార్థి విభాగం, తెలుగు యువత ఆధ్వర్యంలో తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'ప్రజా సేవాతో దేశ సేవా యాత్ర' నిన్న ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు స్వాగతం పలికి వారికి ఆతిథ్యం అందించి, యాత్ర విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సుమారు ఎనిమిది రోజుల పాటు ఈ యత్ర సాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోటుందని నిర్వాహకులు తెలిపారు.

---------------------------

జపాన్ లో జరుగుతున్న ఆసియా క్రీడ పోటీల్లో క్రికెట్ విభాగంలో భారత్ పురుషుల జట్టు ఫైనల్ మ్యాచ్ లో పాకిస్తాన్ తో తలపడుతోంది. మొదట భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లు ముగిసే సమయానికి భారత్ 211 పరుగులు చేసింది. 212 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్తాన్ మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 127 పరుగులు చేసి 4 వికెట్ల నష్టపోయింది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు బంగారు పతకం కైవసం చేసుకుంటుంది.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్ర అధికారి సిహెచ్. నాగభూషణం పేర్కొన్నారు. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి సిహెచ్. నాగభూషణం తెలియజేస్తూ..

వాయిస్..28

=====================